# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 08 జూలై 2025


## ఫిర్యాదుదారులకు నాణ్యమైన పరిష్కారం అందించండి..!..

**జాయింట్ కలెక్టర్ అదితి సింగ్..**

**కడప కలెక్టరేట్, జూలై 7 ప్రభాతవార్త :**



పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సబా భవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచిస్తూ.. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

## చాతుర్మాస దీక్షను ప్రారంభించనున్న మతాంగ నందగిరి స్వామి

**లక్కిరెడ్డిపల్లి : జులై 07 ప్రభాత వార్త**



దొర్రిచెరువు సమీపంలో వెలసిన మతాంగ మహా పీఠాధిపతి మతంగా నందగిరి స్వామి ఈ నెల 10 వ తేదీ నుంచి చాతుర్మాస దీక్ష ప్రారంభించనున్న సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మతాంగ పీఠాధిపతి మాతాంగా నందగిరితో పాటు పీఠం ధర్మాధికారి డాక్టర్ ఏ.వి. సుబ్బారెడ్డి లు సోమవారం మంత్రిని కలిసి 10 వ తేదీన జరిగే కార్యక్రమానికి ఆహ్వానించారు. చాతుర్మాస దీక్ష ప్రారంభం రోజు నుంచి ప్రతీ రోజు మతాంగ మహాపీఠంలో అమ్మవారికి , అభిషేకము , కుంకుమార్చన లాంటి పూజలతో పాటు భక్తి ప్రవచనాలు , భజన కార్యక్రమాలు , ఆధ్యాత్మిక కార్యక్రమాలు మతాంగ మహా పీఠంలో ప్రతీ రోజు జరగనున్నాయని పీఠం ధర్మాధికారి డాక్టర్ ఏ.వి.సుబ్బారెడ్డి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రవీంద్ర నాథ్ రెడ్డి , సాంబశివ , తదితరులు పాల్గొన్నారు.

### అన్నమయ్య ప్రాజెక్టును మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ

# రద్దు చేసిందా!?



చెయ్యేరు నదిలో రాజంపేటకు నీటి సరఫరా కోసం వేసిన ఫిల్టర్లు

### రాజంపేట మున్సిపాల్టీకి అమృత్ నిధులు ఎలా నిలిపివేస్తారు? మున్సిపాల్టీకి శాపంగా మారిన అధికారుల అనాలోచిన నిర్ణయం

**రాజంపేట, జూలై 07, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులను రద్దు చేయలేదు. మరీ మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ రద్దు చేసిందా? ఒక ప్రత్యేక పథకం కింద నిధులు మంజూరై టెండర్లు కూడ పిలిచారు. సాంకేతిక కారణాలతో అధికారులే ఆ టెండర్లు రద్దు చేశారు. అయితే అదే పథకం కింద అర్హత లేదని ఏడాది కాకముందే ఉన్నతాధికారులు ఎలా నిర్ణయిస్తారు. కేంద్రం మంజూరు చేసిన నిధులను ఎలా నిలిపివేస్తారు. అసలు నిధులు నిలిపివేసేందుకు అధికారం వారికి ఎవరిచ్చారు. నదిలో నీరు ఉన్నప్పుడు పైప్‌లైన్ ద్వారా సరఫరా కాదా? అన్నీ ఉన్న మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నిర్ణయం 60వేల మంది జనాభా ఉన్న రాజంపేట మున్సిపాల్టీకి శాపంగా మారింది. పాలక వర్గం స్పందించలేదు. అధికార పార్టీ నేతలు నోరు మెదపడం లేదు. ఫలితంగా మంజూరైన 30.12కోట్ల కేంద్రం నిధులు ప్రజలకు ఉపయోగం లేకుండానే పోయే విచిత్ర పరిస్థితి నెలకొంది. ఈ విచిత్ర పరిస్థితి రాజంపేట మున్సిపాల్టీకే ఎదురైంది. దీనికి సంబంధించి 'వార్త' అందిస్తున్న ప్రత్యేక కథనమిది...

రాజంపేట మున్సిపాల్టీకి కేంద్ర ప్రభుత్వం అమలు చేసే అమృత్-2 పథకం కింద 30.12కోట్ల రూపాయల నిధులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మంజూరయ్యాయి. ఈ మేరకు గత ఏడాది జూలైలో అమృత్ నిధులతో రాజంపేట మున్సిపాల్టీలో నీటి సరఫరా చేసే పైప్‌లైన్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు అమృత్ నిధులను ఖర్చు చేసేందుకు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. రాజంపేట మున్సిపాల్టీ 7.7కి.మీ విస్తరించి ఉంది. దీని ప్రకారం పైప్‌లైన్ వ్యవస్థ ద్వారా నీటి సరఫరా చేసేందుకు అంచనాలు రూపొందించి టెండర్లు కూడ పిలిచారు. అయితే ఒక్క కాంట్రాక్టర్ మాత్రమే టెండర్లలో పాల్గొనడంతో మున్సిపల్ ఉన్నతాధికారులు ఈ టెండర్‌ను రద్దు చేశారు. అయితే గత నెల 24న కడప-అన్నమయ్య జిల్లాలకు అమృత్-2 పథకం కింద 965.45కోట్ల నిధులు మంజూరయ్యాయి.

ఈ నిధులతో కడప కార్పొరేషన్‌కు అలాగే బద్వేల్, మైదుకూరు, జమ్మలమడుగు, మదనపల్లె మున్సిపాల్టీలలో పైప్‌లైన్ వ్యవస్థ, మురికి నీటి వ్యవస్థ అభివృద్ధి చేసేందుకు 3ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. అయితే ఈ టెండర్లలో రాజంపేట మున్సిపాల్టీకి మంజూరైన అమృత్ నిధుల ప్రస్తావనే లేదు. ఈ విశయాన్ని 'వార్త' గత నెల 27న వెలుగులోకి తీసుకువచ్చింది. రాజంపేట మున్సిపాల్టీకి అమృత్ నిధులతో టెండర్లు పిలవకపోవడానికి ప్రధాన కారణం అన్నమయ్య ప్రాజెక్టు లేదని మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. అనంతపురంలో ఉన్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ, రాయచోటిలో ఉన్న ఈఈలు అన్నమయ్య ప్రాజెక్టు లేకపోవడం వల్లే రాజంపేట కు అమృత్ నిధులతో టెండర్లు పిలిచేందుకు అవకాశం లేకుండా పోయిందని స్పష్టం చేశారు. అలాంటప్పుడు గత ఏడాది ఇదే పథకం ద్వారా టెండర్లు ఎలా పిలిచారు? అప్పుడు కూడ అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్ డ్యాం కొట్టుకుపోయి ఉంది. టెండర్లు పిలిచిన రెండు సంవత్సరాలకు ముందే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఉంది. అయినా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడాని అమృత్ పథకానికి ఏమి సంబంధమో అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. ఇకపోతే అన్నమయ్య ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ వద్ద 15ఫిల్టర్ పాయింట్లు ఏర్పాటుచేసి రాజంపేటకు నీటి సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి 4 ఏళ్లు అవుతున్న ఇంకా రాజంపేటకు నీటి సరఫరా నిలిచిపోలేదు. కొనసాగుతూనే ఉంది. అలాంటప్పుడు పైప్‌లైన్ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సింది పోయి మంజూరైన నిధులను ఎలా నిలిపివేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పైప్‌లైన్‌కు అన్నమయ్య ప్రాజెక్టుకు ఏమి సంబంధం అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయంపై మండిపడుతున్నారు. ఒక నిర్ణయం తీసుకునే ముందు కనీసం సమీక్షించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నిస్తున్నారు. కనీసం రాజంపేట మున్సిపాల్టీకి అమృత్ పథకం నిధులు ఖర్చు చేసేందుకు అర్హత లేదని కనీస సమాచారం కూడ తెలపలేదు. 'వార్త' దినపత్రికలో కథనం వచ్చిన తరువాతనే అధికారులు మేల్కొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు పాలకవర్గ సమావేశంలో మండిపడ్డారు. కనీస సమాచారం కూడ తెలుసుకోకుండా బాధ్యతారహితంగా ప్రవర్తించడంపై నిలదీశారు. అయినా అటు పాలకవర్గంలో కానీ ఇటు అధికారుల్లో కానీ చలనం లేదు. అధికారంలో ఉన్న నాయకులకు ఇంత పెద్ద సమస్య కనిపించడం లేదు. 30కోట్ల నిధులు వెనక్కిపోయిన స్పందించిన పాపాన పోలేదు. ఇంజనీరింగ్ అధికారులు మాత్రం తామేమి చేయగలం అని చేతులెత్తేశారు. అమృత్-3 పథకం ద్వారానే ఇక మున్సిపాల్టీకి నిధులు దిక్కు అని ఉచిత సలహా చెప్పారు. దీనికి కారణం ఎవరు. పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటుకు అన్నమయ్య ప్రాజెక్టుకు ఎలా ముడిపెడతారని ఇంజనీరింగ్ అధికారులను నిలదీస్తున్నారు. నీటి సరఫరా జరుగుతున్నప్పుడు సోర్స్ లేదని ఎలా నిర్ణయం తీసుకుంటారు. పోనీ నీటి సరఫరా నిలిచిపోయిందా అంటే అదీ లేదు. అలాంటప్పుడు ఎలా అమృత్ నిధులతో టెండర్లు పిలవకుండా నిర్ణయం తీసుకుంటారని రాజంపేట మున్సిపాల్టీ ప్రజలు ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. అందుకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ దృష్టికి కనీసం స్థానిక టీడీపీ, జనసేన నేతలు కానీ, బీజేపి నేతలు కానీ తీసుకుపోయి చర్చించిన పాపాన పోలేదు. ప్రజా సమస్యల పట్ల కూటమి నేతలకు ఎంత చొరవ ఉందో రాజంపేట మున్సిపాల్టీకి అమృత్ నిధులు నిలిచిపోయిన స్పందించకపోవడాన్ని స్పష్టం చేస్తోంది. ఒక చిన్న మున్సిపాల్టీకి 30కోట్ల గ్రాంట్ నిధులు వెనక్కి పోతే మరళా అన్ని నిధులా ఎలా వస్తాయో కనీసం ఆలోచించే ప్రజాప్రతినిధులు లేరు. సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నం అధికారులు చేయడం లేదు. వీరిద్దరి నిర్లక్ష్యం రాజంపేట మున్సిపాల్టీ పరిధిలోని 60వేల మంది ప్రజలకు శాపంగా మారింది. ఇకనైనా అమృత్‌నిధులతో పనులు చేపట్టేందుకు అధికార యంత్రాంగం, ప్రజా ప్రతనిధులు కృషి చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

### ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు పెంచే

## రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి..**



**చిన్నమండెం మండలం, జూలై 7 ప్రభాతవార్త :**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం, వండాడి పంచాయతీ హరిజనవాడ నందు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రైతుల పొలంలో మామిడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగి, ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటిన రైతులకు వాటి సంరక్షణ కొరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. రైతులందరూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకం చేపట్టి ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. జూలై 8వ తేదీన అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకాన్ని చేపట్టాలని డ్వామా పిడి ఆదేశించడం జరిగిందని ఆరోజు మంత్రివర్యులు అందుబాటులో ఉండకపోవడం వలన నేడు చిన్నమండెం మండలంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఏపీఓ,యండిఓ తెలిపారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

**మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి,ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్,**



**మైదుకూరు, జులై 07, ప్రభాతవార్త:**

నియోజకవర్గం లో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని మైదుకూరు మున్సిపాలిటీ 21 వార్డు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.ఇంటింటికి తిరిగి ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు,అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత సిలిండర్లు,ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇవ్వడంపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు.రాక్షస పాలన పోయి మన ప్రభుత్వం ప్రజల పాలనలో అందరి కళ్ళల్లో ఆనందం చూస్తున్నాం.అన్నదాత సుఖీభవ కూడా తొందరలోనే ఇస్తామని రాక్షస పాలనలో మాదిరిగా మా ప్రభుత్వం కాదని ఎన్నికల వరకే రాజకీయాలు అని మా నాయకుడు చంద్రబాబు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.ఆగస్టు 15వ తారీకు నుండి ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నోఅభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయని తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రాజధాని లేని రాష్ట్రానికి రాజధానిని పరుగులు పెట్టేలా చంద్రబాబు పారిశ్రామిక వేత్తలతో ఉపాధి ఉద్యోగ అవకాశాలతో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారని అంతేకాకుండా రాష్ట్రాన్ని విజన్ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని కొనియాడారు. సుపరిపాలనలో తొలిగడుగు కార్యక్రమంలో కరపత్రాలు పంచడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ యాడ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, మాజీ మాధవరాయ దేవస్థానం చైర్మన్ ఆకుల క్రిష్ణయ్య,మాజి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీను,ధనపాల రవి, ధనపాల యుగంధర్,చిలుం గారి పుల్లయ్య, మాదం రమణ,వెంకటసుబ్బయ్య, చిన్న ఓబయ్య, అధికారులు, వార్డ్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం సబ్ కలెక్టర్‌కు 27పిటిషన్లు



బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నైదియా దేవి

**రాజంపేట, జూలై 07, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్‌కు 27మంది వివిధ సమస్యల పరిష్కారం కోసం పిటిషన్లు అందజేశారు. స్వయంగా సబ్ కలెక్టర్ ఆ వినతులను పరిశీలించారు. బాధితులతో చర్చించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఫిర్యాదుదారులు స్థానిక తహసీల్దార్‌లు తమ సమస్యను పరిష్కరించలేదని ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకుండా పోతుందని అందుకే మీ దగ్గరికి వచ్చినట్లు వివరించారు. అందుకు స్పందించిన సబ్ కలెక్టర్ పరిష్కారానికి అర్హత ఉన్న అన్ని వినతులను పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

## రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం

**ప్రజా దర్బార్ లో వైఎస్ జగన్**

**పులివెందుల, జూలై 7, ప్రభాత వార్త:**



ప్రజలు అందరూ కలసి త్వరలో రాష్ట్రం లోని రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం అని రానున్నాయి మంచి రోజులు అని ఓపికతో ఉండాలని ప్రజా దర్బార్ లో వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు వైకాపా అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం సాయంత్రం బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందులకు చేరుకున్న వైయస్ జగన్మోహన్ రెడ్డికి వైసీపీ నాయకులు కార్యకర్తలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని భాకరాపురం హెలిప్యాడ్ నుంచి వైసీపీ క్యాంప్ కార్యాలయానికి చేరుకొని ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈమధ్య కాలంలో వైసీపీ నాయకుల పై అక్రమ కేసులు పెట్టిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందిస్తూ ధైర్యంగా ఉండండి వచ్చేది మన ప్రభుత్వమే మీకు ఎప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే సంక్షేమ పథకాలలో కోతలు విధిస్తున్నారని, అర్హత ఉన్నా పథకాల అందలేదని ప్రజలు జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ న్యాయపరంగా పోరాటం చేసి ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా పోరాటం చేస్తామని తెలిపారు. రాత్రి ఇక్కడే బస చేసి మంగళవారం ఉదయం వేంపల్లి మండలం లోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకల్లో పాల్గొని తండ్రికి ఘనంగా నివాళులు అర్పించి, తిరిగి పులివెందుల క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. స్వాగతం పలికిన వారిలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష, కడప నగర మేయర్ సురేష్ బాబు, మాజీ శాసనసభ్యులు శ్రీకాంత్ రెడ్డి, మైదుకూరు మాజీ శాసనసభ్యుడు రఘురామిరెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి , మాజీ డిప్యూటీ శాసనమండలి చైర్మన్ సతీష్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైయస్ మనోహర్ రెడ్డి లతోపాటు పలువురు వైకాపా నాయకులు ఉన్నారు.

## కరెంట్ షాక్ తగిలి లైన్ మెన్ మృతి

**పులివెందుల,జూలై 7, ప్రభాత వార్త:**

విద్యుత్ మరమత్తులు చేయిచుండగా ప్రమాదవ శాత్తు సోమవారం కరెంట్ షాక్ తగిలి గంగారపు శివారెడ్డి (46) మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పులివెందుల పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద నివాసం ఉంటూ పులివెందుల మండలం ఉల్లిమెల్ల సబ్ స్టేషన్ నందు లైన్ మెన్ గా జి.శివారెడ్డి పని చేయు చున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే సోమవారం ఉదయం 7:15 గంటలకు డ్యూటికి వెళ్ళి ఉల్లిమెల్ల రోడ్డు లోని కరెంటు పోలుకు మరమత్తులు చేయిచుండగా ప్రమాద వశాత్తు కరెంటు తీగలు తగిలి చనిపోయాడు.విద్యుత్ శాఖ సిబ్బంది గుర్తించి విషయాన్ని పోలీసులకు శివారెడ్డి మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. ఆఫీసులో పని చేసే వారు శివారెడ్డి భార్య అయిన నాగ పద్మలతకు విషయం చెప్పగా వారి బంధువులు పులివెందులకి చేరుకొని ఆసుపత్రి వద్ద చేరుకున్నారు. మృత దేహం వద్ద భార్య చేస్తున్న రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి.మృతుడు శివారెడ్డి అన్న నాగరాజు పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆపరేటర్ నిర్లక్ష్మమే లైన్‌మెన్‌ను బలి తీసుకుందా ?

ఆపరేటర్ నిర్లక్ష్మమే లైన్ మెన్ శివారెడ్డి ప్రాణాన్ని బలి తీసుకుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.శివారెడ్డి ఎల్సి తీసుకొని మరమ్మతులు చేస్తున్న శివారెడ్డికి విద్యుత్ షాక్ ఎలా తగిలింది.సబ్ స్టేషన్ లో విధులు నిర్వర్తించే ఆపరేటర్ నిర్లక్షయం వల్ల ఎల్సి తీసుకొన్న విషయం మరచిపో యో లేక తెలియక పోవడం వల్ల సరఫరా ఆన్ చేయడంతో షాక్ తగిలి మృతి చెంది ఉంటాడని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది నిర్లక్షయాన్ని దాచిపెడుతున్నారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏమి జరిగింది ఎలా శివారెడ్డికి కరెంట్ షాక్ తగిలింది అన్న ప్రశ్నలకు శాఖా అధికారులు సమాధానం చెప్పాలి. పోలీస్ ల విచారణలో శివారెడ్డి మృతికి గల కారణాలు తేలే అవకాశం ఉంది.




శివారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న అతని భార్య

## ఆర్వోబీ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

**పీలేరు జులై 7 ప్రభాతవార్త:**

పట్టణంలో నిర్మిస్తున్న తిరుపతి మదనపల్లి మార్గం అలాగే చిత్తూరు రాయచోటి మార్గం రెండు ఆర్వోబీ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని వివిధ సంఘాల నాయకులు, పట్టణ ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ శివకుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెండేళ్లకు పైగా ఆర్వోబీల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొన్నారు. దుమ్ముదూళితో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. ఎల్బీఎస్ రోడ్డు, చిత్తూరు రోడ్డు మార్గాల్లో వాహనాలు వెళ్లేందుకు నానా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వ్యాపారాలు పూర్తిగా దెబ్బతీన్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## శ్రీ వీరాంజనేయ స్వామి తిరుణాళ్ళు, ఉట్లోత్సవం

**రామసముద్రం జులై 7 ప్రభాతవార్త**

మండలం లోనికనగాని గ్రామంలో వెలిసిన అతి పురాతన శ్రీ వీరాంజంజనేయ స్వామి తిరుణాళ్ళు ఉట్లోత్సవం అత్యంత వైభవం గ్రామ స్థులు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయ అర్చకులు అచ్యుతరావు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి పలు రకాల పుష్పా లతో అలంకరణ చేసి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం బాగ్యం కల్పించారు.అర్చకులు భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కనులు పండువగా ఉట్లోత్సవం జరిగింది. ఉట్లోత్సవం నకు తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే రాత్రి కనగాని గ్రామ పురవీధుల్లో శ్రీ సీతా రామాంజనేయులు పుష్ప పల్లకి పై ఊరేగింపు స్వామివార్లకు పురవీధుల్లో మంగళ హారతులు పట్టి కొబ్బరి కాయలు కొట్టి మొక్కలు చెల్లించుకున్నారు.

## కరెంట్ షాక్ తో యువకుడు దుర్మరణం

**మదనపల్లి క్రైమ్ జూలై 7 ప్రభాతవార్త.**

బ్యానర్ కడుతుండగా కరెంట్ షాక్ కొట్టి యువకుడు మృతి చెందిన విషాదకర సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. 2టౌన్ పోలీసుల కథనం మేరకు స్థానిక గొల్లపల్లిలో నివాసం ఉన్న ఎలక్ట్రీషియన్ ఖాజా(30) సహచరులతో కలిసి సిటిఎం రోడ్డు, బాపూజీ పార్కు సమీపంలో బ్యానర్లు కడుతుండగా ప్రమాదవశాత్తు 11 కె.వి విద్యుత్ లైన్‌లపై పడిపోయాడు. దీంతో ఖాజా అక్కడికక్కడ మృతి చెందాడు. మరో యువకుడు స్వల్పంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డాడు.

## 14, ఎర్రచందనం దుంగలు పట్టివేత

**ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్, ఒక వ్యక్తి పరార్**

**సిద్ధవటం జూలై, 7 ప్రభాతవార్త**

సిద్ధవటం రేంజ్, సిద్ధవటం అటివిశాఖ బీట్ లో ఎర్రచందనం దుంగలను తరలించే ప్రయత్నం చేస్తుండగా ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసు కొన్నామని, మరో స్మగ్లర్ పరారయ్యారని సిద్ధవటం అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలిపారు ఈ సందర్భంగా ఆమె అటవీశాఖ కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ మాకు రాబడిన రహస్య సమాచారం మేరకు కడప డిఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు సిద్ధవటం గ్రామ శివారులోని ఆంజనేయ గుడి కమ్మ పాలెం గ్రామం సమీపాన ఆదివారం అర్ధరాత్రి తమ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించగా అక్కడ ముగ్గురు వ్యక్తులు, కడప మండలం రామాంజనేయ పురం గ్రామానికి చెందిన సన్న పూరి వెంకట రమణ, కొప్పర్తి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, సిద్ధవటం మండలం కమ్మపాలెం గ్రామానికి చెందిన శికామణిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామని అక్కడ ఉన్న 14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు పరారైన వ్యక్తి ఎవరని పట్టుబడ్డ ముద్దాయిలను విచారించగా తిరుపతి నగరడానికి చెందిన గిరిబాబు అని చెప్పారని అతని కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని పట్టుబడ్డ ముద్దాయిల సెల్ఫోన్లో కొన్ని సమాచారాలు సేకరించామని గిరిబాబు ఆచూకీ కోసం స్పెషల్ టీములు ఏర్పాటు చేశామని అక్కడ లభ్యమైన( ఏపీ 04,2007) అనే నెంబర్ గల కారు స్వాధీనం చేసుకున్నామన్నారు పట్టుబడ్డ ఎర్రచందనం,193 కేజీలు ఉండగా వాటి విలువ రూ, 56000, వేలు, చేస్తుందని ముద్దాయిను తిరుపతి కోర్టు లో హాజరు పరుస్తున్నామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలిపారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓబులేసు, నీటీవీ, పెంచల రెడ్డి,, మధు, ఏబిఓ, హైమావతి స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, సాహెబ్ బావి బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



## పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయండి



దువ్వూరు, జూలై 07, ప్రభాతవార్త:

జనసేన పార్టీని గ్రామ స్థాయి నుండి కమిటీలు వేసి పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయాలని నియోజికవర్గం జనసేన పార్టీ నాయకుడు పాశం లక్ష్మీ నరసయ్య అన్నారు. కేవలం జనసేన పార్టీ ఆఫీసులో పనిచేసిన వారికే పదవులు ఇస్తున్నారని గ్రామ స్థాయి నుండి పార్టీని అభివృద్ధి చేస్తున్న వారిని పట్టించుకోవడం లేదన్నారు. పార్టీకి వివిధ రకాలుగా సహకారం అందించామని వారికి న్యాయం జరగడం లేదన్నారు. జనసేన పార్టీని గ్రామ స్థాయిలో బలపరుచుకునే ఉద్దేశం లేనప్పుడు ఎందుకు కార్యకర్తలకు తెలపలేదని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకొని పనిచేసే నాయకులకు న్యాయం జయగడం లేదని, లక్షలు ఖర్చు పెట్టి పార్టీ సభ్యత్వాలు నమోదు చేసింది ఎవరికోసం అని ఆయన ప్రశ్నించారు. మాకు పార్టీ పదవులు అవసరం లేదన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం పార్టీ వాళ్లు జనసేన పార్టీ కార్యకర్తలను పట్టించుకోవడం లేదన్నారు. పార్టీ కార్యకర్తలకు న్యాం చేయలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన పార్టీని నమ్ముకొని పార్టీ అభివృద్ధికి సహకరించిన వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

## సచివాలయ సిబ్బందికి ఘనంగా వీడ్కోలు



ఖాజీపేట, జూలై 07, ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల ప్రక్షాళన ప్రారంభించిది. అందులో భాగంగా 5సంవత్సరాలు ఒకే చోట సర్వీసు నిండిన సచివాలయ ఉద్యోగులను బదిలీ చేశారు. ఆ బదిలీలల్లో భాగంగా ఖాజీపేట మండల పరిధిలోని రావులపల్లి సచివాలయంలోని 8మంది సిబ్బంది పలు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని సోమవారం నాడు ఖాజీపేట మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, రావులపల్లి సర్పంచ్ పైడేల శివరామిరెడ్డి మరియు ఆయన అనుచరగణం ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా సర్పంచ్ పైడేల శివరామిరెడ్డి మాట్లాడుతూ గత 5సంవత్సరాల నుండి సచివాలయాల్లో సిబ్బంది ఎనలేని సేవలను అందిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో సచివాలయ సిబ్బంది సేవలు చిరస్మరణీయం అని కొనిఆడారు. ప్రతి ఉద్యోగికి బదిలీ అనేది సాధారణం అని మీరు ఎక్కడికి బదిలీ అయినా మునుపటి ఉత్సాహాలతోనే ప్రజలకు సేవలించాలని సూచించారు. సన్మాణ కార్యక్రమంలో రావులపల్లి సర్పంచ్ శివరామిరెడ్డి, వైకాపా నాయకులు చల్లా నాగేశ్వర్ రెడ్డి, పాటిమీద పల్లె శ్రీనివాసులు రెడ్డి, దాసరి గంగయ్య, బత్తల మల్లయ్య, కుమ్మరరావులపల్లె తవ్వా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా పరిష్కరానికి కృషి చేస్తాం

వేంపల్లె : జూలై 07 (ప్రభాత వార్త):



వేంపల్లె పట్టణంలో మూడు, నాలుగు రోజులగా కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తింది. తాగు నీరు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పై సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ట్యాంకర్ ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. వేంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఫిల్టర్ లలో నీరు తక్కువగా వస్తుండటంతో ఆదివారం పాపాగ్ని నదిలోకి వెళ్లి ఆయా ఫిల్టర్ లను సర్పంచ్ పరిశీలించారు. నూతన ఫిల్టర్ లు వేసి వెంటనే ప్రజలకు తాగునీటి ని అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ ఆదేశాలతో సోమవారం పాపాగ్ని నదిలో పంచాయతీ సిబ్బంది కొత్త ఫిల్టర్ లను వేస్తుండటంతో కొత్త నీటి ఫిల్టర్లను సర్పంచ్ పరిశీలించారు. ఫిల్టర్లలో నీరు తక్కువ రాకుండా ఉండాలని 70 అడుగుల లోతుకు పైపులు దింపి వేంపల్లి గ్రామ ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కసిరెడ్డి ఆదినారాయణ రెడ్డి , శ్రీను ఉన్నారు.

## సంక్షేమ పాలన కూటమితోనే సాధ్యం

వేంపలె :జులె 07:(ప్రబాత వార)



సంక్షేమాభివృద్ధి పాలన అందించాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి సీనియర్ నేత, వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో ఆ పార్టీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన ఘన విజయాలు, అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఏపి సిఎం చంద్రబాబు అపారమైన అనుభవం, పరిపాలన దక్షతతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. ఓ వైపు ప్రజలకు సంక్షేమ పాలన, మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు వెల్లడించారు. సుపరిపాలన అందిస్తూ కూటమి ప్రభుత్వం తొలి అడుగు పూర్తి చేసుకుందని తెలిపారు. అలాగే నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి టిడిపి బాధ్యుడైన బిటెక్ రవి ఎనలేని కృషి చేస్తున్నారని, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవితేజరెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నాయకులు వేమాకుమార్, మహమ్మద్, గిరి,కొండయ్య,యాసిన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## డాబా తొలగింపు

దువ్వూరు, జూలై 07, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతీయ రహదారిపై ఇడమడక తనఖీ కేంద్రం వద్ద ఉన్న డాబాను తహసీల్దార్ సంజీవ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తొలగించినట్లు ఆర్ఐ జాన్సన్, వీఆర్వో హరిలు తెలిపారు. డాబాకు ఎటువంటి అనుమతులు లేకపోవడం, జాతీయ రహదారికి దగ్గరలో ఉండటంతో పలు ఫిర్యాదులు రావడంతో డాబాను తొలగించినట్లు తెలిపారు. మైదుకూరు అర్బన్ ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును నిర్వహించారు.

## మండలంలో సంస్థాగత ఎన్నికలు:

ఒంటిమిట్ట జూలై 07(ప్రభాతవార్త)

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒంటిమిట్ట మండలంలో సోమవారం సంస్థాగత ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలలో కొండమాచపల్లి, గొల్లపల్లె గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. రాజు గుడి పల్లె , సాలాబాద్, మాధవరం గ్రామాల్లో ఇద్దరు పోటీ పడ్డారు. పోటీబడ్డ వీరి సమాచారాన్ని అధిష్టానానికి సమాచారం ఇవ్వడం జరుగుతుందని మండల అబ్జర్వర్ ఈశ్వరప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గజ్జల .నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి. బొబ్బిలి రాయుడు, ఆలూరి .వెంకటసుబ్బయ్య, శ్రీహరి, కృష్ణమూర్తి ,ఎంవి రమణ, తదితర నాయకులు పాల్గొన్నారు.



## పసుపులేటి లక్ష్మికర్ కు ఘన సత్కారం



పసుపులేటి లక్ష్మీకర్ కు సత్కారం

పీలేరు జూలై 7 ప్రభాతవార్త:

పీలేరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గా 3వ సారి ఎంపికైన పసుపులేటి లక్ష్మీకర్ ను పీలేరు బలిజ సంఘం ఘనంగా సన్మానించి సత్కరించింది. అధికారంతో సంబంధం లేకుండా గత రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో ఉండి, పార్టీ పురోగతికి అహర్నిశలు కష్టపడి మండలంలో పార్టీ విజయం కోసం పసుపులేటి లక్ష్మీకర్ ఎంతో కృషి చేసినందుకు వరుసగా మూడవసారి తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక బలిజ సంఘం నాయకులు లక్ష్మీకర్ ని ఘనంగా సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీలేరు బలిజ సంఘం నాయకులు పోతంశెట్టి రమేష్, పివి రమణ, వి. రామచంద్ర, సత్యనారాయణ, బండారు నాగేంద్ర ప్రసాద్, పసుపులేటి సురేష్, పర్వతాల మల్లికార్జున, జ్ఞానంగారి హరీష్, ఏజె జగన్, బాలినేని మనోహర్, పివిఎస్ లక్ష్మీ, చరిత, కళావతి, పలువురు బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు. తనపై ఇంత నమ్మకాన్ని ఉంచి తనకు పదవినిచ్చిన పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, అలాగే తన పై ఎంతో ప్రేమాభిమానాలు చూపి తనను సన్మానించి గౌరవించిన తన బలిజ ఆత్మీయులకు ఈ సందర్భంగా పసుపులేటి లక్ష్మీకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## మండలానికి కేకే చౌదరి రాక

పెనగలూరు జూలై 7 ప్రభాతవార్త



8 తేదీన ఉదయం 9 గంటలకు పెనగలూరు మండలం ఎంపీడీవో కార్యాలయం నందు జరగబోయే సర్వసభ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డ్ చైర్మన్ కేకే చౌదరి విచ్చేయుచున్నారు. ఈ సందర్భంగా పెనగలూరు మండలం లోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ సీనియర్ నాయకులు అభిమానులు పాల్గొనవలసిందిగా పెనవలూరు మండలం తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు ఏంజెర్ల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు

## భూ వివాదంలో ఘటన స్థలాన్ని పరిశీలన ఎస్సై



రామసముద్రం జూన్ 7 ప్రభాతవార్త .

భూ వివాదంలో నరసాపురం, ఏతూరు పల్లి గ్రామాల మధ్య ఘర్షణ జరిగింది. సోమవారం వివాదాస్పద స్థలాన్ని ఎస్సై రమేష్ బాబు పరిశీలించారు. స్థల వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలు గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని, స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ఈ భూ వివాదం ఘర్షణ సంఘటనలో మండలంలోని ఏతూరు పల్లెకి రమణ మరి కొందరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు. ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామం, ఏతురుపల్లె గ్రామాలకు చెందిన కొందరు భూ వివాదం దాడి చేసుకున్నారు. దీంతో నరసాపురం గ్రామానికి చెందిన ఐదు మందికి తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులు పిర్యాదు మేరకు నిందుతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి. రమేష్ బాబు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో భవన కార్మికుడు మృతి

మదనపల్లి క్రైమ్ జూలై 7 ప్రభాతవార్త.



అనుమానాస్పద స్థితిలో భవన కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురబలకోట మండలం సిద్ధారెడ్డి గారి పల్లి కి చెందిన శివశంకర్ (45) భవన కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య భాగ్యమ్మ, ఒక కుమారుడు తేజ్ కుమార్ లు ఉన్నారు. ఇతను ఆదివారం రాత్రి కూలీ పనులు ముగించుకొని మద్యం సేవించి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడ్డాడు. గాయాలు బారిన పడిన అతను స్వయంగా తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రంతా ఇంట్లో నిద్రపోయిన శివశంకర్ సోమవారం ఉదయం ఎంతకు నిద్ర లేవకపోవటంతో అనుమానం వచ్చిన భార్య భాగ్యమ్మ పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. భర్త మృతి చెందిన విషయాన్ని ముదివేడు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో శవపరీక్షలు పూర్తి చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## అల్లాడుపల్లె దేవళాల్లో భక్తులకు అన్నదానం..!



చాపాడు, జూలై 7 ప్రభాతవార్త.

మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో శ్రీ వీరభద్రస్వామి అన్నసత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని ఆలయ కమిటీ ఛైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్వామి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన తెలిపారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు గోసుల వీరారెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కురబలకోట ఈఓగా గురుమోహన్

కురబలకోట, జులై 7 ప్రభాతవార్త :



కురబలకోట మేజర్ గ్రామ పంచాయితీ సెక్రటరీగా పి.గురుమోహన్ పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజాసమస్యలపై పరిష్కరించేందుకు చర్యలు చేపడుతానని తెలిపారు. సోమవారం గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశ, నిర్దేశం చేశారు.

## పండుగ వాతావరణంలో మెగా పీటీఎం



గాలివీడు, జులై 7(ప్రభాతవార్త):

మండల వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన నిర్వహించ తలపెట్టఇన మెగా పేరెంట్స్ టీచర్స్(పీటీఎం) 2.0 కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మెగా పీటీఎం కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా, బడుల్లో నాణ్యమైన విద్య, పథకాల అమలులో పారదర్శకత, అభివృద్ధి పనుల వేగవంతానికి మెగా పీటీఎం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

## చర్చి ఎన్నికలలో జీసెస్ ప్యానెల్ గెలుపు



ప్రొద్దుటూరు, జులై 7, ప్రభాతవార్త :

ఎస్.పి.జి ఫాస్టేట్ 1 చర్చి ఎన్నికలలో జీసెస్ ప్యానెల్ గెలుపొందింది. ఆదివారం జరిగిన ఈ ఎన్నికలలో రాత్రి విజేతల వివరాలను ప్రకటించారు. 326 మందికి గానూ 309 మంది ఓటు వేయగా 90 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ సందర్భంగా విజయం సాధించిన జీసెస్ ప్యానెల్ సభ్యులు మాట్లాడుతూ ఎస్.పి.జి ఫాస్టేట్ 1 చర్చి ఎన్నికలలో 202528 సంవత్సరానికి గాను జీసెస్ ప్యానెల్ 9 లో 6 మంది గెలపొందారని, జనరల్ విభాగంలో ముగ్గురు, యూత్ విభాగంలో ఒకరు, స్త్రీల విభాగంలో ఇరువురు గెలుపొందామని వివరించారు. తమను గెలిపించిన సంఘ సభ్యులకు ఎన్నిక సజావుగా సాగేందుకు సహకరించిన పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. జనరల్ విభాగంలో దపెళ్ళ భాస్కర్, అభినందన్, సంపత్ కుమార్, స్త్రీల విభాగంలో చక్రకోళ్ళ రోజి, కానాల సరోజ, యూత్ విభాగంలో పత్తూరు దినేష్, అదేవిధంగా మరో వర్గం నుండి సునీల్, మెగల్ బాబు, విల్సన్ గెలుపొందారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్దమండెం జూలై 7 ప్రభాతవార్త

మండలంలోని కొలిమికాడిపల్లి వద్ద సోమవారం ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి పెద్దమండెం మండలంలో నిన్న జరిగిన పీర్ల పండగ విందు కసం సోమవారం చిన్న మండెం మండలం నుంచి వెంకట సుబ్బారెడ్డి తన భార్య స్రవంతి ద్విచక్ర వాహనంలో వస్తూ సోమవారం ఉదయం 12 గంటల సమయంలో కొలిమికాడపల్లి మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో సుబ్బారెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి దీంతో 108 లో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వర్షాలు రాక రైతులు దిగాలు.

తొండూరు జూలై 7 ప్రభాతవార్త:

మండల పరిధిలోని సుమారు 20 గ్రామాలలో వర్షాలు దాకా రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు కొద్దిపాటి వర్షం పడిందని ఆ వర్షాధార ఆధారంగా వేసిన ఉల్లి, మిరప, కాకర, టమోటా పైర్లకు గాలిపోటుతో తెగులు మరియు పురుగుల ఆశించి ఉన్న పైరును నష్టపరుస్తున్నాయి. దీనితో రైతు పెట్టుబడి ఎక్కువగా పెట్టి పైరు గాలికి సరిగ్గా పెరగక చీడపీడల తో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందా రాదో అన్న భయంతో వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. సరైన సమయంలో వర్షాలు రాక భూమిలో ఉన్న నీరు బోరు ద్వారా పైరుకు తడిగా అందించిన వెంటనే తడి ఆరిపోయి బోరులో నీరు కూడా ఇంకిపోతున్నాయి. ఉల్లి విత్తనాలను సేరు 1200 కొనుగోలు చేసి ఎరువులు పురుగుమందులు ఇలా ఒక ఎకరానికి 30000 దాకా పెట్టుబడి పెట్టారు పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే తాము ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా వానదేవుడు కరుణించి వర్షాలు కురవాలని వేడుకుంటున్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

పీలేరు జులై 7 , ప్రభాతవార్త:



ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఎం ఆర్ పి ఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు సందర్బంగా పీలేరు మండలంలో పీలేరు టౌన్, మోడల్ కాలనీ, బండ్ల వంక, రేగల్లు, వేపుల అబ్బాయిలు, గుట్ట కింద పల్లి, మేళ్లచెరువు తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి 31వ దినోత్సవ వేడుకలు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారి జన్మదిన వేడుకలను నిర్వహించారు సోమవారం సాయంత్రం పీలేరు పట్టణం బండ్ల వంకలో అక్కడ సీనియర్ నాయకులు పివి రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి ,టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర్ హాజరై మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో పాటు అనే సామాజిక ఉద్యమాలు చేపట్టి సబ్బండ్ వర్గాలకు ఎం ఆర్ పి ఎస్ ఉద్యమం అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఖాదర్, ఎస్టి నాయకులు సురేష్ నాయక్, బీసీ నాయకులు ఆర్ఎస్ చిన్న, ఎంఎస్పి పీలేరు నియోజకవర్గం కో ఇన్చార్జి ముదివేడు శ్రీనివాసులు, ఎం ఆర్ పి ఎస్ ఎం ఎస్ పి సీనియర్ నాయకులు ఈపూరి వెంకటరమణ, రాచపల్లి వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ నాయకులు గండికోట రెడ్డి కుమార్, ఎం ఎస్ పి నాయకులు బండ్ల వంక పివి రమణ, బాలసుబ్రమణ్యం, ఎర్రబల్లి మురళి, ఎర్రబల్లి సుబ్రహ్మణ్యం , నరసింహులు, శంకర, వంశి, అనిల్, విహెచ్పిఎస్ నాయకులు అమర్నాథరెడ్డి సుభహాన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం.

చిట్వేలి, జూలై 7,ప్రభాతవార్త:

చిట్వేలి మండల పరిధిలోని పత్తిగుంట వారి పల్లి 33 కేవీ సబ్స్టేషన్ నందు మరమ్మత్తుల కారణంగా నేడు అనగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాధ్య ఏ ఈ చలపతి తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలోపల్లి, ఈడిగపల్లి, పత్తిగుంట వారి పల్లి గ్రామాల గృహ మరియు వ్యవసాయ రైతులు ఇబ్బందిని గుర్తించి సహకరించాలని ఏఈ చలపతి తెలిపారు.

## అన్నదాత సుఖీభవ పిర్యాదుల పోర్టర్ ప్రారంభం

చిన్నమండెం జూలై 7 ప్రభాత వార్త:

ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం పోస్టర్ను ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి గీత తెలిపారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పరిశీలనలో తిరస్కరించిన రికార్డులు యం ఆర్ ఓ లాగిన్లో పెండింగ్ ఉన్న రికార్డులు గ్రీవెన్స్ మాడ్యూల్ లో పొందు పరచడం జరిగిందని తెలిపారు. కావున ఏదైన అభ్యంతరాలు ఉన్న రైతులు తమ రైతు సేవ కేంద్రాలను సంప్రదించాలని కోరారు, ఈ నెల 13 వ తేదీ లోగా రైతులు తమ అభ్యంతరాలను తెలపవలెను.జూన్ 30 వ తేదీ తర్వాత వెబ్ ల్యాండ్ లో నమోదైన రైతుల భూమి ఖాతాలు కూడా ఈ పదకానికి అర్హులు .రైతులకు ఏదైనా అనుమానాలు ఉంటే 155251 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చు అని తెలిపారు.

## 40 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు



సిద్ధవటం జూలై 7 ప్రభాతవార్త

మండలానికి 40 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ రమేష్ రెడ్డి తెలిపారు, ఈ సందర్బంగా మంజూరైన యూరియాను ఆయన పరిశీలించారు, మండల కేంద్రమైన సిద్ధవటం, కేంద్రమైన సిద్ధవటం లోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, మంజూరైన యూరియాను ,8 నుండి యూరియా పంపిణీ చేస్తామని అన్నారు ఒక బస్తా విలువ, రూ, 266, 50 పైసలు అవుతుందని ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు పట్టా పాస్, పుస్తకము తో సిద్ధవటం వ్యవసాయ శాఖ అధికారి, కార్యాలయంకు వచ్చి యూరియాను, పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు, సేవ కేంద్రాల వ్యవసాయ సహాయకులు శివకుమార్, మోనిక, మురళీధర్ పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని మంత్రులను కోరిన నేతలు

కడప కార్పొరేషన్ జూన్ 7 ప్రభాతవార్త:



బీసీ ఆత్మ గౌరవ సభకు కడప జిల్లా నుండి బీసీ సంక్షేమ సన్నంఘ అధ్యక్షులు బత్తల లింగమూర్తి ఆధ్వర్యంలో 50 మంది సభ్యులు 8 వాహనాలలో తిరుపతికి వెళ్లి సభకు ముఖ్యతదులుగా హాజరైన రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ గార్లను కలిసి బీసీ సమస్యల ఎదురుకుంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. కడపలో రూ. 5.65 కోట్లతో నిర్మించిన బీసీ భవనమునకు తగిన మోలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలనీ, స్థానిక సంస్థలలో బీసీ లకు 34 శాతం అవకాశం కల్పించాలని, క్రిమి లేయర్ విధానాన్ని రద్దు పరచాలని, చట్ట సభలలో బీసీ లకు రిజర్వేషన్ కల్పించాలని, చేతి వృతులైన బీసీ లకు ఆధారణ పథకం ద్వారా పని ముట్లు అందచేయాలని కోరారు. నగరం కార్యవర్గ సభ్యులతో పాటు పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బీసీ సంఘ నాయకులు మంత్రులను కలిసిన వారిలో ఉన్నారు.

## రేపు సమ్మెను విజయవంతం చేద్దాం

పీలేరు జూలై 7 ప్రభాతవార్త :



సమ్మె నోటీసు అందిస్తున్న కార్మిక నాయకులు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన సమ్మెను విజయవంతం చేద్దామని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి. వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఆయన కార్మికులతో కలిసి పీలేరు గ్రామపంచాయతీ శానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్ కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలు, హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాయడాన్ని నిరసిస్తూ, కేంద్ర కార్మి సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమ్మెలో కార్మిక, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు యూనియన్ అధ్యక్షులు బీవీ రమణ, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటరమణ, చిట్టెమ్మ, సరోజమ్మ, సుబ్బలక్ష్మి, రాజేశ్వరి, అశోక్, ధన భాగ్య, ప్రతాపరెడ్డి, శాంతకుమారి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## చివరిదాకా పెద్దిరెడ్డితోనే తన పయనం

పీలేరు జూలై 7 ప్రభాతవార్త:

తన జీవితకాలం చివరి వరకు కూడా మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోనే కొనసాగిస్తానని వైయస్సార్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి చిన్న ఎల్లప్ప తెలిపారు. రాష్ట్రస్థాయి పదవి పొందిన శుభ సందర్భంగా ఆయన సోమవారం తిరుపతిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేస్తూ ట్రేడ్ యూనియన్ లో తన శక్తి వంచన మేరకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా నియమితులైన చిన్న ఎల్లప్ప అన్నారు. అనంతరం వాల్మీకిపురంలో పీలేరు మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్ర రెడ్డిని కూడా ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిన్న ఎల్లప్పకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్, కాలనీ చిన్న, షేక్ షాహీర్ పాల్గొన్నారు.

## వైయస్సార్ పార్టీ కార్యకర్తలకు పదవులు దక్కడంపై హర్షం

పీలేరు జూలై 7 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తలకు పదవులు దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. సోమవారము గౌరవ మాజీ శాసనసభ్యులు శ్రీ చింతల రామచంద్రారెడ్డి ని కలికిరి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. ముఖ్యముగా కలికిరి మండలం నందు ముగ్గురికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కమిటీ నందు పదవులు దక్కినాయి కలికిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చింతపర్తి సహదేవయ్యను కలికిరి మండల క్రిస్టియన్ విభాగ అధ్యక్షుడిగా సుందరమ్మ కాలనీ కృష్ణమూర్తిని పీలేరు నియోజకవర్గం క్రిస్టియన్ అధ్యక్షుడిగా జూపల్లి రామచంద్రయ్యను మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి కమిటీ సభ్యులను ప్రకటించిన రు ఈ కార్యక్రమములో మండల కన్వీనర్ చింతల రమేష్ కుమార్ రెడ్డి ఉమ్మడి జిల్లాల ఎస్సీ సెల్ కార్యదర్శి వి హరి మహేందర్ రెడ్డి ఈశ్వర్ గౌడ్ మచ్చ సాదేవయ్య రామకృష్ణ శ్యాముల్ గిరి హరి కృష్ణయ్య బాబు గురు రహిమాన్ నాగరాజా పాల్గొన్నారు అనంతరం కమిటీ సభ్యులు సహదేవయ్య రామచంద్ర కృష్ణమూర్తి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించినారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున నేను అందరికీ అండగా ఉంటానని తెలియజేసినారు మీరందరూ కలికిరి మండలములో కలిసికట్టుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పని చేయాలని కోరారు.



## ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి తండ్రి నాగిరెడ్డి అడ్రస్ కోటం గురువాయ పల్లె గ్రామం, ఖాజీపేట (మం) కడప (జిల్లా)ఏపీ., మా ఇంటి నుండి జిరాక్స్ కొరకు బైకుపై ఖాజీపేట మండల కేంద్రముకు వెళుతుండగా మా ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది నెం:823/1979 దొరికిన వారు పై అడ్రస్‌కు తెలియజేయగలరు తగిన పారితోషికం ఇవ్వబడును సెల్ : 6302723525

## జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కండి



బద్వేలు అర్బన్, జూలై 7, ప్రభాతవార్త

జన విజ్ఞాన వేదికలో భాగస్వామ్యం తీసుకొని అందులో పని చేయడం ఒక సామాజిక అవసరం అని బి కోడూరు మండల విద్యాశాఖ అధికారి మూరతోటి సునీల్ కుమార్ అన్నారు. సోమవారం బి కోడూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేకవారిపల్లె పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి మూరతోటి సునీల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా కలిసిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎడి దేవదత్తం అభ్యర్థన మేరకు జన విజ్ఞాన వేదికలో సభ్యత్వం తీసుకున్నారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ కృష్ణ సార్, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు ఉపాధ్యాయుల తో కలసి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కండి అని జన విజ్ఞాన వేదిక ప్రచారం చేయుచున్న కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక గత 38 సంవత్సరాలుగా తెలుగు ప్రజలతో స్నేహ బంధాలు కొనసాగిస్తూ ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను చైతన్యవంతం చేస్తుంది. నేడు ధర్మాధర్మముల మధ్య సత్యాసత్యముల మధ్య ఘర్షణ జరుగుతున్నదన్నారు. ఈ ఘర్షణలో బుద్ధి జీవులు ఏ పక్షం వహించాలో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు చివరకు జ్ఞానం అజ్ఞానాన్ని సత్యం సత్యాన్ని తప్పక జయిస్తాయన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు దేవదత్తం మాట్లాడుతూ మనం చేసే శాస్త్రీ ఆలోచన క్రమాన్ని ఆటంకపరిచే శక్తులు అడ్డుకునే శక్తులు సామాజిక వ్యవస్థలో ఉన్నాయి అలాంటి హేతు విరుద్ధ శక్తుల పట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేసే కర్తవ్యం జనవిజ్ఞాన వేదిక చేస్తున్నది. అనేక రంగాలలో మునిపెన్నడూ ఊహించని ఆవిష్కరణలతో విజ్ఞాన శాస్త్రం దూసుకుపోతున్నా.. మధ్యయుగాల చాందస సంకుచిత భావాలు ప్రజానీకాన్ని ఆ విజ్ఞాన ఫలాలను అందుకోనీకుండా చేస్తున్నాయి. ప్రజల కోసం ఆ విజ్ఞానం ఫలాలు ఉపయోగపడాలని జనవిజ్ఞాన వేదిక ఆకాంక్షిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కొండయ్య, ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, రామాంజనేయ రాజు, శ్రీనివాస్, పవన్ ,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారులను తిప్పరాదు: తాసిల్దార్



రైల్వేకోడూరు రూరల్, జూలై 7 ప్రభాతవార్త

తాసిల్దార్ కార్యాలయంలో వస్తున్న అర్జి దారులను తిప్పవద్దని స్పందించి వెంటనే అర్జీదారులకు న్యాయం చేయాలని వీఆర్వోలకు రైల్వేకోడూరు తాసిల్దార్ కే అమర్నాథ్ సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం పై సంబంధిత విఆర్వోలు రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని గ్రామీణ ప్రాంతాల్లోని రైతులను అర్జీ దారులను తాసిల్దార్ కార్యాలయం వస్తే తక్షణమే స్పందించి వారి సమస్యలను వీలైనంతవరకు పరిష్కరించి అవసరమైతే తమ దృష్టికి తేవాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలతో అర్జీదారులను వెంటనే సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని తాసిల్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీదేవి విఆర్వోలు దర్బార్ భాష రాముడు యోహాన్ అరవ వెంకటయ్య, ఈశ్వరయ్య రఘుపతి సృజిని తదితరులు పాల్గొన్నారు.

## చెట్లను నరికిన ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేయాలి

ఎడ్యుకేషన్ జూలై 7 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ వాల్టా చట్టం 2002 ప్రకారం భూమి, నీరు, మరియు చెట్లను పరిరక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది, అయితే రాజుపాలెం మండలం వెల్లాల అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సి పల్ పాఠశాల ఆవరణంలో రాగి చెట్లు వేప చెట్లను తొలగించారని ఆమెపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జగన్, లింగమయ్య డిమాండ్ చేశారు. ఎటువంటి పర్మిషన్ తీసుకోకుండా చెట్లను కొనుగోలు చేసే వారితో ఒప్పందం కుదుర్చుకొని చెట్లను విక్రయం జరిపి సొమ్ము చేసుకున్నారని ఆరోపణ చేశారు. విషయంపై స్పందన నందు కలెక్టర్ విభాగంలో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు, లేనిపక్షంలో ఆర్ఎస్ఓ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని వారు తెలియజేశారు.

## సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

ఎడ్యుకేషన్ జూలై 7 ప్రభాత వార్త :

జులై 9వ తేదీ సార్వత్రిక సమ్మెకు MCPI(U) విద్యార్థి విభాగం AIFDS సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని జిల్లా కార్యదర్శి సిపి నాగేంద్ర తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పడుతున్నటువంటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోకుండా రకరకాల జీవో పేరుతో వారితో చలగావట ఆడుతున్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఎనిమిది గంటల పని దినాన్ని రక్షించాలని కాంట్రాక్ట్ అవుట్ నర్సింగ్ కార్మికులను ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26 వేలు ప్రకటించాలని ప్రభుత్వం రంగా సంస్థల ప్రైవేటు కరణ ఆపాలని డిమాండ్ చేశారు అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్యగా డిమాండ్ చేస్తూ 9న జరగబోయే సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమా ప్రదీప్ హేమంత్ ప్రకాష్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ నాన్న ఇద్దరు కొడుకులు ఇదే కోడూరు రాజకీయం

ఎమ్మెల్యే ఎవరో తెలియక ప్రజలు తికమక.



రైల్వేకోడూరు రూరల్, జూలై 7 ప్రభాతవార్త

నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎవరో తెలియక ప్రజలు తికమక పడుతున్నారని అయితే అనుభవిస్తున్న వారిలో అమ్మ నాన్న ఇద్దరు కొడుకులు ఒక బామర్ది అని మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు అన్నారు. సోమవారం వైసీపీ అధిష్టానం ఏర్పాటు చేసిన చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెస్తూ ఐదు వారాల బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు మేనిఫెస్టో కోడ్ ద్వారా డాక్యుమెంట్ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్చార్జ్ సురేష్ బాబు కడప పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి కొండూరు అజయ్ రెడ్డి లు మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలు ప్రతి ఒక్కరు బాబు షూరిటీ, మోసం గ్యారంటీ మేనిఫెస్టో కార్యక్రమాన్ని ఇంటింటికి చేపట్టాలని ప్రతి ఒక్కరు ఈ కొన్ని స్కాన్ చేసిన చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఈ కూటమి ప్రభుత్వంలో ఒక్కొక్క కుటుంబానికి ఎంత మోసం జరిగిందో గ్రామ స్థాయిలో ఉన్న ప్రజల ఇండ్ల వద్దకు వెళ్లి ప్రజలకు తెలియజేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబు రెడ్డి, వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసలరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా యువజన అధ్యక్షులు యలగ చర్ల శివా ప్రసాద్ రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివ సాయి, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ ఐదు మండలాల కార్యకర్తలు సర్పంచులు ఎంపీటీసీలు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి జేసీఆర్ తోనే సాధ్యం

తంబళ్లపల్లె జూలై 7. ప్రభాతవార్త :

నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధికి తంబళ్లపల్లె టిడిపి ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి తోనే సాధ్యమని పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర కొనియాడారు. సోమవారం ఆయన టిడిపి నాయకులతో కలిసి మండలంలోని గంగిరెడ్డిపల్లి పంచాయతీలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రజల నుండి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు మీసాల భాస్కర్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, మస్తాన్ రెడ్డి, మల్లికార్జున నాయుడు, చాంద్ బాషా, శ్రీనివాసులు, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



## నారాయణ నెల్లూరులో సుపరిపాలనకు తొలి అడుగు



పెనగలూరు జూలై 7 ప్రభాతవార్త

మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలో సోమవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి హాజరై ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సేవలు గురించి కరపత్రాలు ద్వారా వివరిస్తూ ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో రాష్ట్రం సర్వతో ముఖాభి అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఇసుకపల్లిలో 5 లక్షల రూపాయల వ్యయంతో ఆర్ అండ్ బి రోడ్డు కంభం బోటు వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కే కళాచంద్ర డిసిసిబి మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసరెడ్డి, దాసరి దామోదర్ నాయుడు, మారం రెడ్డి నరసింహ, అమీరుల్లా,ఎం శీను, జ య చంద్ర రాజు, వాసు,వెంకటరమణ, నారాయణరాజు, శ్రీనివాసరాజు, పి శివ, గంగిరెడ్డి,నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



బద్వేలు ,జూలై 7, ప్రభాతవార్త

నియోజకవర్గంలో ఫ్రీ హోల్డ్ భూముల అక్రమ భూదందాపైన సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, ఈ భూదందా నడిపించిన ,సహకరించిన సూత్రధారులు, పాత్రధారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ యం.ఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు సంగటి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్ రాజు, జకరయ్య ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నందు ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 70 వేల ఎకరాల పైబడి ఫ్రీ హోల్డ్ భూములను గుర్తించగా అందులో గత ప్రభుత్వం చివరి నిమిషంలో జారీ చేసిన ఫ్రీ హోల్డ్ భూముల క్రమబద్ధీకరణ జీవోను అడ్డుపెట్టుకొని సుమారు జిల్లావ్యాప్తంగా 9 ఎకరాల భూదందా జరిగినట్లు అధికారులే స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. అందులో బద్వేల్ నియోజకవర్గంలో సుమారు 1500 ఎకరాల పైబడి ఫ్రీ హోల్డ్ భూముల అక్రమ దందా జరిగినట్లు మాకు సమాచారం ఉన్నదని ఈ విషయంపై రెవెన్యూ అధికారులు సమాచారం ఇవ్వడానికి సైతం జంకుతున్నారంటే ఇందులో పాత్రధారుల సూత్రధారులపై పలు అనుమానాలు కలుగుతున్నాయని వారు అనుమానం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తవుతున్నా నేటికీ విచారణ పేరుతో కబ్జాదారులను అందుకు సహకరించిన వారిని కాపాడుతున్నారు అనడంలో సందేహం లేదని ఏ పార్టీ గెలిచిన మీరంతా ఒక్కటేనని విషయం ప్రజలకు అర్థం అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చట్టపరమైన చర్యలు తీసుకొని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లేని పక్షంలో ప్రజాగ్రహాన్ని చూడాల్సి వస్తుందని ఇది ఇలాగే కొనసాగితే భారత్ కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్ రాజు, జకరయ్య నియోజకవర్గ నాయకులు, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## భర్తను హత్య చేసిన కేసులో భార్య అరెస్ట్

మదనపల్లి క్రైమ్ జూలై 7 ప్రభాతవార్త.



భర్తను హత్య చేసిన కేసులో భార్యను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్టు మదనపల్లి డిఎస్పి మహేంద్ర, తాలూకా సిఐ కళా వెంకటరమణ లు తెలిపారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రూరల్ మండలం కొత్తవారిపల్లి పంచాయతీ రెడ్డిగానిపల్లికి చెందిన వి. చంద్రశేఖర్ 20 సంవత్సరాల క్రితం సదుం మండలం పాలమందకు చెందిన రమాదేవిని వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. చంద్రశేఖర్ మద్యం కు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో, భార్య రమాదేవి, మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. ఈ క్రమంలో రెండో తేదీ పిల్లల చదువు కోసం ప్రభుత్వం ఇచ్చిన తల్లికి వందనం డబ్బుల కోసం భార్యాభర్తలిద్దరూ ఘర్షణ పడ్డారు. అదే సమయంలో మద్యం తెచ్చుకున్న చంద్రశేఖర్ భార్యను గ్లాసులో పోసి ఇవ్వాలని కోరగా, అతని అట్టు తొలగించుకోవాలనుకున్న రమాదేవి మద్యలో విషపు గుళికలను వేసింది. మద్యం సేవించి అనంతరం మరోసారి ఘర్షణ ఇవ్వడంతో ఆ సమయంలో రమాదేవి భర్త గొంతు గట్టిగా నొక్కడంతో పాటు కర్రతో మోకాళ్లపై బలంగా బాధింది . అతను మత్తులో పడిపోగానే ఇంటి బయట వచ్చికు వచ్చి నిద్ర పోయింది. మధ్యలో విషపకులకు ఉండడంతో రాత్రి అంతా రక్తం కట్టుకొని చంద్రశేఖర్ ఇంట్లోనే మృతి చెందాడు. ఉదయం అతని మృతి చెందిన గమనించిన భార్య రమాదేవి రక్తపు మరకలు అన్ని తుడిచివేసి ఏమీ తెలియనట్లు కూలి పనులకు వెళ్లిపోయింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఆమె స్థానికులతో తన భర్త చనిపోయాడని తెలిపింది. ఏమీ తెలియనట్లు భర్తకు అంత్యక్రియలు చేయడానికి ఏర్పాట్లు కూడా పూర్తి చేసుకుంది. విషయం తెలుసుకున్న మృతుడు తమ్ముడు మహేష్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ కళా వెంకటరమణ దర్యాప్తులో రమాదేవి నిందితురాలుగా గుర్తించి సోమవారం ఎర్రగానం మెట్ట వద్దన్న ఆమెను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ సమక్షంలో అరెస్ట్ అనంతరం రిమాండ్ కు తరలించారు.

## వైఎస్సార్సీపీ బలోపేతా నికి కృషి చేయండి

పీలేరు , జూలై 7 ప్రభాతవార్త:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, పుంగనూరు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా సుంకర చక్రధర్, వైఎస్సార్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిన్నయల్లప్ప నియమితులయ్యారు. దీంతో వారు సోమవారం మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు దండు జగన్మోహన్ రెడ్డి. ఆనంద్. కాలనీచిన్న, పి. ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, భువనేశ్వర్రెడ్డి. పాపిరెడ్డి, దావూద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మొహరం వేడుకలు

కాశినాయన..జులై 07 ప్రభాతవార్త

మండలపరిధిలోని వరికుంట్ల లో మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు గత 4రోజులనుంచి చిన్న సరిగేసు ,పెద్దసరిగేసు ,పగులు సరిగేసు లు నిర్వహించారు బాలాయపల్లి గ్రామంలో కూడా ఈ రోజు పురవీధులగుండా పేర్లను ఊరేగించారు హిందూ ముస్లిం బాయి బాయి అంటూ పండుగను భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు నరసాపురంలో గుండంలో మొద్దులు తొలి గత 3 రోజులనుంచి ఘనంగా పండుగను నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తాదులు పాల్గొన్నారు.

## విగ్రహ ఘటనపై ప్రత్యేక దార్యాప్తు చేయాలి

బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు

మదనపల్లె, జులై 7 ప్రభాతవార్త :



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

గౌతమ బుద్ధిని విగ్రహ తల నరికిన ఉన్మాద దుర్గటనపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందంను ఏర్పాటు చేయాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఎస్టియూ భవన్‌లో ప్రజాసంఘాలతో కలసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కులవివక్షతో బౌద్ధులను అవమానించి దురుసు ప్రవర్తనలతో దళితనేతను గాయపరిచి బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేసిన జిల్లా పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఛలో మదనపల్లె కార్యక్రమాన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. మదనపల్లె తాలూకా పోలీసులు విగ్రహ ధ్వంసం ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. బుద్ధ విహార నిర్వాహకులు ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ దుర్ఘటనపై పక్షపాతం లేకుండా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విగ్రహ ధ్వంసం ఘటనపై అంబేద్కర్ విగ్రహం ముందు దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేయడానికి పెద్దసంఖ్యలో పోలీసులు మొహరించడాన్ని తప్పుపట్టారు. దీక్షకు నాయకత్వం వహించిన పిటిఎం శివప్రసాద్‌ను అరెస్టుచేసి గాయపరచడం కూడా జరిగిందన్నారు. పౌరహక్కులను గాలికి వదిలేసి పోలీసులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శనం, సిపిఐజిల్లా కార్యదర్శి పిఎల్.నరసింహులు, సిపిఎం ప్రభాకర్, కెవి.రమణ, శివకుమార్, నరసింహ పాల్గొన్నారు.

## వెలుగుస్కూల్‌లో 28వ వార్షికోత్సవ వేడుకలు

మదనపల్లె, జులై 7 ప్రభాతవార్త :



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉంటున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సోమవారం 28 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెలుగుస్కూల్ సెక్రటరీ ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వర్గీయ పద్మజ పాలరాతి విగ్రహానికి పూలామల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997లో స్వర్గీయ టిఎన్.రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా 15మంది దివ్యాంగులతో బెంగుళూరు రోడ్డులో వెలుగుస్కూల్ ప్రారంభించడం జరిగిందన్నారు. నేటికి 27ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించామన్నారు. పాఠశాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, వార్డెన్ స్వీటి, సుజాత, పిల్లలు, వృద్దులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అధికారం అవసరం లేదు

వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్



బోరు డ్రిల్లింగ్‌కు భూమిపూజ చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జులై 7 ప్రభాతవార్త :

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారం ఉండనవసం లేదని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూరల్ మండలం పోతబోలు పంచాయతీ మల్లయ్యదేవరపల్లెలో నెలకొన్న నీటిసమస్య పరిష్కారానికి ప్రజలు విన్నవించడంతో ఎంపి మిథున్‌రెడ్డి నిధులతో నూతనంగా బోరు డ్రిల్లింగ్ చేయడం జరిగిందన్నారు. నీటి సమస్యపై ప్రజలు విన్నవించడంతో ఎంపి దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఎంపి స్పందించి నిధులు మంజూరుచేశారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు ముందుంటానని ఎంపి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి ప్రజాసమస్యలు వచ్చినా తన దృష్టికి తెస్తే ఎంపి ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని తెలిపారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ప్రజాసమస్యల పరిష్కారంలో తీవ్రంగా విఫలం అయ్యిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను అన్ని విధాల మోసం చేసిందన్నారు. ఈకార్యక్రమంలో పోతబోలు సర్పంచ్ ఈశ్వరయ్య, ఎంపిటిసి రేవంత్, మాజీ ఎంపిటిసి రత్నమయ్య, వెంకటేష్, లక్ష్మన్న, ఈశ్వర్‌నాయక్, హరినాయక్, నరసింహులు, మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెట్టులో చేనేత బ్యాగులు పంపిణీ



బ్యాగులు పంపిణీ చేసిన దృశ్యం

కురుబలకోట, జులై 7 ప్రభాతవార్త :

తంబళ్ళపల్లె నియోజవర్గం కురబలకోట మండలం ఉమ్మడి తెట్టు గ్రామంలో సోమవారం చేనేత బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది. తెట్టు గ్రామం రుషివ్యాలీ స్కూల్ వద్ద హరిజనవాడ, పూజారివారిపల్లె, దిగువబోయనపల్లె, నాయనివారిపల్లె,జల్లావారిపల్లె, చింతయ్యాగారికోట, నార్లపల్లెల్లో హ్యాండ్లూమ్స్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేనేత బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేజారి తిమ్మరాయుడు, మాజీ ఎంపిపి కమిటీ మెంబర్లు రామ్మోహన్, శ్రీనివాసులురెడ్డి, రుషివేలి ఉపాధ్యాయులు వేణు, రాము, తుంగావారిపల్లె నరిసంహులు, పూజారివారిపల్లె సుధాకర్ పాల్గొన్నారు.

## రాచవేటివారిపల్లె గ్రామ కమిటీ ఎన్నికలు

నిమ్మనపల్లె, జులై 7 ప్రభాతవార్త :



సన్మానిస్తున్న దృశ్యం

నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె గ్రామం కమిటీ టిడిపి అధ్యక్షులు ఎన్నికలు ఆర్‌జె.వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు మండల పరిశీలకులు శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌జె.వెంకటేష్ సమావేశం నిర్వహించిన అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షులుగా మల్లికార్జున నాయుడు, ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డిలకు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ మధు, మండల నాయకులు రాజన్న, రత్న సుధాకర్, శ్రీనివాసులు, గ్రామ కమిటీ సభ్యులు శంకర్, వెంకటరమణ, పిల్లి రవి, శివక్రిష్ణ, ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కు వినతి



పెద్దమండెం జూలై 7 ప్రభాతవార్త

మదనపల్లెలోని అంకి శెట్టి పల్లెలో ఇటీవల మానవ ఉన్మాదులు మానవ మృగాలు బుద్ధ విగ్రహాలపై దాడి చేసి తలలు నరికి సీసీ కెమెరాలు పగలగొట్టి పైప్ లైన్ ధ్వంసం చేసి ఉన్మాదులను కఠినంగా శిక్షించి వారిపై చర్యలు చేపట్టాలని సోమవారం అంబేద్కర్ యువసేన అధ్యక్షుడు జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల మోహన్ తహసిల్దార్ కు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా బుద్ధ విహారయాత్రగా నిర్వహించాలని మానవ వికాస కేంద్రంగా నిర్మించాలని కోట్లు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్న ఆత్మీయ బౌద్ధ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పంతో బౌద్ధులు దీక్ష చేస్తుండగా వాటిని ఉన్మాదులు ధ్వంసం చేసి మూత విగ్రహం తలలున్నరకి సమాజానికి చీరపురుగుల తయారయ్యారని వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నాయకులు చంద్ర రామాంజులమ్మ మోహన. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు



పెద్దమండెం జూలై 7 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో సూపర్ పాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించింది ఈ కార్యక్రమాన్ని మండల నాయకులు బీటెక్ సుమన్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సంవత్సరంలో చేపట్టిన వాటిని ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు ప్రభుత్వం అందించిన ఆరు గ్యారెంటీలను ప్రతి ఇంటిలో అడిగి తెలుసుకున్నారు రానివారికి తిరిగి రప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు తల్లికి వందనం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు దీపం పథకం మహిళలకు ఉచిత గ్యాస్ బస్సు ప్రయాణం రైతు సంక్షేమం యువతకు ఉద్యోగాలు అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ సంవత్సర కాలంలో రాష్ట్రానికి తెచ్చిన పరిశ్రమల గురించి ప్రతి ఇంటికి వివరించడం జరిగింది తల్లికి వందనం రాని వారిని గుర్తించి వారికి డబ్బులు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు రానివారు సంక్షేమ పథకాలు అందనివారు మా దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కరించుకోవాలని ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో కూటమ నాయకులు పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం నేరం



రామసముద్రం జూలై 7 ప్రభాతవార్త

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అనాలోచిత నిర్ణయాలతో చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రమేష్ బాబు స్పష్టం చేశారు. మండలంలోని నరసాపురం, ఏతూరు పల్లె గ్రామస్తుల మధ్య ఆదివారం భూ వివాదం నెలకొంది.ఇరువురూ ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఓ వర్గానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయమై బాదితుల ఆదివారం సాయంత్రం పోలీసుల కు పిర్యాదు చేసారు.అయితే తాము ఇచ్చిన పిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేయలేదని ఆరోపిస్తూ సోమవారం ఉదయం నరసాపురానికి చెందిన బాధిత కుటుంబాల వ్యక్తులు,గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన ఎస్సై ఆదివారం సాయంత్రమే నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐఆర్ కాపీని చూపించడంతో బాధిత కుటుంబీకులు శాంతించారు. అయితే ఎఫ్ఐఆర్‌లో నిందితులపై నాన్ బెయిలబుల్ సెక్షన్ లు లేవని,ఎఫ్ ఐ అర్ మార్చాలని బాదితుల ఎస్సై ను డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కేసు తీవ్రతను అనుసరించి,చట్టానికి లోబడి కేసు నమోదు చేశామని, ఎవరి ఇష్ట ప్రకారం వారికి అనుకూలంగా కేసులు ,సెక్షన్లు మార్చడం కుదరదని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా గత నెలలో ఇదే సామాజిక వర్గానికి చెందిన వందలాది మంది ఓ కేసు విషయమై పోలీస్ స్టేషన్ ను ముట్టడించి, స్టేషన్ ముందు ధర్నా చేయగా ప్రత్యేక పోలీస్ బలగాలు బలగాలతో పికెటింగ్ నిర్వహించారు.

## పొగాకు కొనుగోలు చేయాలని రైతులు నిరసన

ముద్దనూరు. జూలై 07. ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో ఉన్న వేర్ హౌస్ నందు జమ్మలమడుగు నియోజకవర్గం పరిధిలోని పెద్దముడియం మండలం కొండ సుంకేసుల గ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డితో పాటు 20 మంది రైతులకు సంబంధించి 350 క్వింటాళ్ల పొగాకు, మండలంలోని కొట్టాలపల్లి గ్రామానికి చెందిన అశోక్ కుమార్ రెడ్డి పొగాకు రైతు 75 క్వింటాళ్ల పొగాకు ను గతంలో వేరౌస్ యాజమాన్యం ఒక రకం 18500, మరో రకం 15,500 రూపాయలతో కొనుగోలు చేస్తామని, ఇప్పుడు గతంలో చెప్పిన రేటు ప్రకారం కొనుగోలు చేయమని చెప్పడంతో సోమవారం నాడు వేర్ హౌస్ నందు రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఘటన స్థలానికి ఎస్ఐ మైనిద్దీన్ చేరుకొని ఎటువంటి ఘటనలకు పాల్పడకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. రైతులు జమ్మలమడుగు టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డికి సమాచారం అందించగా భూపేష్ రెడ్డి యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి మూడు రోజుల గడువు లోపల పొగాకును కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు యాజమాన్యం కొనుగోలు చేసేంతవరకు పొగాకు లోడుతో వచ్చిన వాహనాలతో ఇక్కడే ఉంటామని ఎలాంటి ఘటనలో చేయమని రైతులు తెలిపారు.



# మమ్ముసిద్ధి పల్లెలో తొలి అడుగు

**పెండ్లిమర్రి జూలై 07 ప్రభాతవార్త**

ప్రతి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం లో ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి ప్రతి ఇంట అందిన సంక్షేమం చిరునవ్వుతో పలకరింపులు సోమవారం పెండ్లిమర్రి మండలం పరిధిలో రంపతాడు పంచాయతీ మమ్ముసిద్ధిపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాను మేరకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం లో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఏడాది చంద్రన్న చెప్పిన సూపర్ సిక్స్ లో అలమలు పథకాలు 4000 రూపాయలు పింఛన్, ఉచిత గ్యాస్ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం అలాగే తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్న అంతమందికి రూ 13000 మరియు అమలు కాబోతున్న పథకాలు ఈ నెల మొదటి వారంలో అన్నదాత సుఖీభవ రైతులకు ఇచ్చే నగదు తో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ 20.000 ఇచ్చే కార్యక్రమం అలాగే ఆగస్టు 15 న మహిలకు ఉచిత బస్సు ప్రయాణం ఇంట్లో 18 సంవత్సరాల నిండి 59 సంవత్సరాలు వయసు వారికీ నెలకు 1500 వందలు ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సంక్షేమ పథకాలు వివరిస్తూ ఇంత ఆలస్యం అవ్వడానికి కారణం గత ప్రభుత్వం అర్థక విధ్వంసం వలన సమయం తీసుకో వలసి వస్తుంది అని వివరించారు. అలాగే ఎమ్మెల్యే ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వ అధికారులచే అక్కడే పరిష్కారం చూపుతూ కానివి



ఎలా చెయ్యాలి అని అధికారులు పరిష్కారం చూపే లా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సారధి రెడ్డి తాసిల్దార్ అనురాధ ఎంపీడీవో జగన్మోహన్ రెడ్డి మండల స్థాయి అధికారులు నాయకులు రాజశేఖర్ రెడ్డి కిషోర్ రెడ్డి బాలిరెడ్డి అన్నమయ్య టిడిపి నాయకులు కార్యకర్తలు ఆ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్

# (USA మధ్య విద్యా సహకార అవగాహన ఒప్పందం

**రాయచోటి జూలై 07 ప్రభాతవార్త**

శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల (SSITS), రాయచోటి తన విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి విస్తరిస్తూ, అమెరికాలోని ప్రఖ్యాత సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్‌తో విద్యా, పరిశోధన, నైపుణ్య అభివృద్ధి రంగాలలో అవగాహన ఒప్పందం (MOU) కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ప్రతినిధులు జాన్ ఎడ్వర్డ్ క్రిస్టోఫర్ మరియు ఇన్నిస్ కర్టిన్, ప్రీతీ సింగాల్ పాల్గొని, "గ్రామీణ ప్రాంతంలో ఉన్న SSITS వంటి సంస్థ అంతర్జాతీయ ప్రమాణాల మేరకు విద్యను అందించడం ప్రశంసనీయం. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధన, శిక్షణ మరియు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలపై విశేషంగా లాభం కలుగుతుంది," అని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ రాజ్ పుత్ మాట్లాడుతూ, "ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులలో బహుళ నైపుణ్యాల వికాసం, పరిశోధనాత్మక దృ కృథం మరియు సాంకేతిక లోతైన అవగాహన ఏర్పడేలా ఉద్దేశించాం. డేటా సైన్స్, AI, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్‌చెయిన్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక విభాగాల్లో వర్క్‌షాప్‌లు, శిక్షణ శిబిరాలు, ప్రాజెక్టు మార్గదర్శనం చేపడతాం," అని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ డా. ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, "ఈ ఒప్పందం SSITS విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల మేరకు అధ్యయన మరియు పరిశోధన వాతావరణాన్ని అందించి,



భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై మరింత ప్రభావం చూపుతుంది," అన్నారు. కళాశాల నాక్ B+ అక్రిడిటేషన్ మరియు అటానమస్ హోదా పొందిన నేపథ్యంలో ఈ ఒప్పందం మరో మైలురాయిగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ప్రఖ్యాత విద్యాసంస్థలతో ఇటువంటి ఒప్పందాలను కొనసాగించేందుకు SSITS కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

**ప్రొద్దుటూరు అర్బన్, జులై 7, ప్రభాత వార్త:**

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పిలుపు మేరకు సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 39 వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమం ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఈ.వి.సుధాకర్ రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకుంటూ,ఏడాదిగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చెంగా సిద్దయ్య, బందారు రాము, వరుణ్, వరదరాజులు, హుస్సేనీ, కొండయ్య, చంద్రశేఖర్, గంజికుంట అంజి, మాడెం సుధాకర్ రెడ్డి, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు బోగా శివకళ్యాణి, అంజనమ్మ, బోగా వీరయ్య, కె. సి. కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ద్వార్శల గురివి రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, నాగరాజు, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, కంకర గౌస్, మునీర్, కమాల్ బాషా, మోతుకూరి బాల, పల్లా సురేష్, టీఎన్టీయుసి జిల్లా అధ్యక్షులు చింతకుంట కుతుబుద్దీన్, టౌన్ బ్యాంక్



సుపరిపాలనను వివరిస్తున్న మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి

డైరెక్టర్ గంగాధర, మాజీ తెదేపా పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, వద్ది బాలుడు, బచ్చల ప్రతాప్, సత్యనారాయణ రెడ్డి, తలారి పుల్లయ్య, తాటి శ్రీనివాసులు యాదవ్, పొడావుల రమణ, సుంకర శ్రీను, పగిడాల దస్తగిరి, రిటైర్డ్ ఎస్సై శంకర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

# తల్లి పేరు మీద ప్రతి విద్యార్థితో మొక్కలు నాటించండి

**రాయచోటి, జూలై 07 ప్రభాతవార్త**

ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ను నిర్వహిస్తున్నామని, తల్లి పేరుమీద ప్రతి విద్యార్థితో మొక్క నాటించడం ద్వారా తల్లిదండ్రుల పట్ల, పర్యావరణం పట్ల బాధ్యత పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్లో ఈనెల 10న నిర్వహించబోయే మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌పై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డీఈఓ, డిఐఈఓ, ఎంఈఓలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ లు ఎంపీడీఓలు, రాజంపేట అడిషనల్ ఎస్పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే లతో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో మెగా పేరెంట్స్ టీచర్ మీట్ నిర్వహించడం జరుగుతోందని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలలో ఈ కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలలో దాదాపు రెండు లక్షల 50 వేల మంది విద్యార్థులు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు అందరూ కలిపి దాదాపుగా 6,75,000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగానే ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమం కింద మొక్కను నాటేందుకు ప్రతి విద్యార్థికి గ్రీన్ పాస్‌పోర్ట్ ఇస్తారన్నారు. తల్లి పాదాలకు వం




దనం చేసి మొక్కను నాటడాంతో పాటు దానిని సంరక్షించి అది మాను అయ్యే వరకు కాపాడాలన్నారు. ఇందుకు సంబంధించి లీప్ యాప్ లో వివరాలను అప్లోడ్ చేయాలని, ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రుల నుండి స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొనేలా ఆహ్వానించాలన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందజేస్తున్న భోజన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ..మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ల నందు పోలీస్ శాఖ వారు సే నో టు డ్రగ్స్, సైబర్ క్రైమ్స్, ఆడపిల్లలు మరియు మహిళలను ఏ విధమైన వేధింపులకు గురిచేసే పరిణామాలు, తదితర అంశాలపై పాటించాల్సిన మెళకువలు గురించి ఎస్హెచ్ఓలు అవగాహన కల్పిస్తారన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ ప్రదేశాలలో పెద్ద సంఖ్యలో ఉన్నటువంటి పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రతిష్టమైన భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్య రాకుండా సిబ్బందిని కేటాయించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## అలివేలమ్మను పరామర్శించిన వైయస్ షర్మిలారెడ్డి

**వేంపల్లె: జూలై 07 (ప్రభాత వార్త)**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసి రెడ్డి సతీమణి అలివేలమ్మను సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల పరామర్శించారు. గత కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న వైయస్ షర్మిల తులసిరెడ్డి స్వగృహానికి వెళ్లి ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం వైయస్ షర్మిల ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ఆమె ఇడుపులపాయ కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధృవ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పులివెందుల పట్టణ అధ్యక్షులు అనిల్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, ఉత్తన్న, డాక్టర్ సుబ్రమణ్యం, తిరుమల శెట్టి వేమయ్య, వేమ నాగరాజు, పసుపులేటి బద్రీనాథ్, రాఘవయ్య,రాజు, తదితరులు పాల్గొన్నారు.



# గల్లంతైన మృతదేహం లభ్యం

**సంబేపల్లి జూలై 7 ప్రభాతవా ర్త**

సంబేపల్లి మండలం జరికోన మరో మడుగులో గల్లంతైన ఉస్మాన్ మృతదేహాన్ని సోమవారం సంబేపల్లి పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో వెలికి తీశారు ఎస్సై భక్తవత్సలం సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షించారు ఎట్టి కేకలకు ఉస్మాన్ మృతదేహాన్ని బయటకు తీశారు అనంతరం మృతదేహాన్ని సేవ పరీక్ష నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసుల వివరాలు మేరకు కర్నూలు జిల్లాకు చెందిన మహమ్మద్ అస్లాం పెద్ద కుమారుడు ఉస్మాన్ శెట్టిపల్లి దేవపట్ల అసం జివాండ్లపల్లి మసీదులలో గురువుగా పనిచేస్తుండేవారు ఆదివారం కావడంతో సరదా కోసం స్నేహితులతో కలిసి జరికోన మరోమడుగులో మునిగి ప్రమాదవశాస్తూ గల్లత్తయి మృతి చెందాడు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## వన్ దన్ వికాస్ కేంద్రాలతో జీవనోపాధి మెరుగు



గిరిజన మహిళలకు సూచనలిస్తున్న అధికారి.

**చిట్వేలి, ఆగస్టు 7, ప్రభాతవార్త:**

జీవన ఉపాధిని మెరుగుపరిచే వన్ దన్ వికాస్ కేంద్రాలను గిరిజనులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోడూరు నియోజకవర్గం వై డి పి రామ చంద్రయ్య అన్నారు. సోమవారం ఆయన రాజుకుంట, చెర్లోపల్లి గ్రామ పంచాయితీలలో పర్యటించారు. అనుంపల్లి పాత యానాది కాలని మహిళతో మట్లాడారు. గిరిజనుల జీవనోపాధి మెరుగు పరుచుకోవడానికి వన్ దన్ వికాస్ కేంద్రాలు ఉపయోగపడతాయని అన్నారు. పొదుపు సంఘాలుగా ఏర్పాటు కావాలని మహిళలకు సూచించారు. ఆధార్ కార్డు లేని వారికి చేయించడానికి చర్యలు తీసుకొంటామన్నారు. కోడూరు నియోజకవర్గంలోని ప్రతి యానాది కాలనిలో మహిళలతో స్వయం సహాయక సంఘం ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామన్నారు. మారుమూల ప్రాంతమైన రాజుకుంట, చెర్లోపల్లి , దామరచెర్ల, కురవళి యానాది కాలినిలపై ప్రత్యేక దృష్టి పెడతామని ప్రభుత్వ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు.పంచాయితీ కార్యదర్శి రమణ ,వైద్య సంక్షేమ సహాయకులు మణికృష్ణ ఆయన వెంట ఉన్నారు.

# సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**దువ్వూరు, జూలై 07, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని మండల తహసీల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీఓ రామకృ ష్ణలు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రజల నుండి వచ్చే వివిధ వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం మండల స్థాయి అధికా రులు, మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివకుమార్, ఎంఈఓ భాస్కర్, ఏపీఓ లక్ష్మీ నారాయణ, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# వ్యాపారంగా మారిన విద్య, వైద్య రంగం

**బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్**



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**మదనపల్లె, జులై 7 ప్రభాతవార్త :**

మదనపల్లె పట్టణంలో విద్య, వైద్యం వ్యాపారరంగంగా మారి ప్రజలను పీడిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి మదనపల్లెలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న విద్యా, వైద్య రంగాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లెలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు నిబంధనలకు విరుద్దంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తూ పిల్లల తల్లిదండ్రులను యాజమాన్యాలు పీడిస్తున్నాయన్నారు. రెండు రోజుల క్రితం సిటీఎం వద్ద ఉన్న మహతి కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించలేదని విద్యార్థిని అవమానపరిచినందు వల్ల ఆ అవమానం తట్టుకోలేక విద్యార్థిని సూసైడ్ నోట్ రాస్తూ ఇంటినుంచి వెళ్ళిపోయిన ఘటన ఉదారం అన్నారు. ఆ ఒక్కకళాశాలలోనే కాకుండా చాలా స్కూల్స్, కళాశాలల్లో ఇలా జరుగుతున్నాయన్నారు. వైద్యరంగంలో కూడా కనీస అర్హత లేని సిబ్బందిని నియమించి వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ప్రైవేటు, కార్పోరేట్ ఆసుపత్రుల్లో దోపిడిని తట్టుకోలేక ప్రభుత్వ ఆసుపత్రికి వెలితే అక్కడా వైద్యుల నిర్లక్ష్యంతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మదనపల్లెలో జరుగుతున్న విద్యా, వైద్య రంగాలపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి



**బద్వేల్ అర్బన్, జులై 7, ప్రభాత వార్త**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయుసి ఇచ్చిన పిలుపులో మేరకు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గురయ్య అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ ధర్నా ను ఉద్దేశించి ఏఐటీయూసీ బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం అవుతున్న ఇంతవరకు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని, గత ప్రభుత్వంలో విభజించు పాలించు అనే విధంగా పారిశుద్ధ్య కార్మికులకు ఒక రకమైన వేతనం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇంకొక విధంగా ఇచ్చారు. అయితే ఉన్నటువంటి కార్మికులు అందరూ కూడా మున్సిపాలిటీని నమ్ముకుని పని చేస్తా అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా కూడా వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపాలిటీలో పని చేస్తున్న ప్రతి కార్మికుడికి అందించాలని అలాగే మున్సిపాలిటీలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడ్ని పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 11వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరగబోయే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు, శ్రీనివాస రాజు, ఆదినారాయణ, వెంకట్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి దేవా పాల్గొన్నారు

## ఎమ్మార్వో కి సీఐటీయు సమ్మె నోటీసు

**చిట్వేలి, జులై 7, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం జిల్లా నాయకులు పందికాళ్ళ మణి, వీఆర్ఏ సంఘం డివిజన్ అధ్యక్షులు కొరముట్ల సుధాకర్ స్థానిక ఎమ్మార్వో స్పందనకు సోమవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని, కనీస వేతనం 26000 ఇవ్వాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం తగ్గించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపడుతున్న ఈ సమ్మెకు కార్మికులు రైతులు ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీఆర్ఏలు సుబ్బరాయుడు, శ్రీను, చంద్ర, రమణ, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గందపుపీరు మెరవణి



**చిన్నమండెం జూలై 7 ప్రభాతవార్త;**

జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన చిన్నమండెం మొహరం పండుగ ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి గంధపు పీరు మెరవణి పీర్ల మఖాన్ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గంధపు పీరు మెరవణి పీర్ల మఖాన్ నుండి కొబ్బెర దివిటీలు వెలుగులో అంత్యంత ఘనంగా ప్రారంభమయ్యింది. బళ్లారి డ్రమ్ము,బెంగళూరు మ్యూజిక్ తాసలు,బాణసంచాల పుర వీదులలో మెరవణి చేశారు,కర్ర సాము,వివిధ రకాల నల్లమందు పేలుళ్ల వీక్షకులను అలరించాయి.ఈ వేడుకల్లో పలువులు రాజకీయ నాయకులు, కార్యకర్తలు ,వివిధ ప్రాంతాలనుండి వచ్చిన హిందూ,ముస్లిం సోదరులు వేలాదిగా పాల్గొన్నారు. అన్నదానం చేశారు.వచ్చే సంవత్సరం చిన్నమండెం గ్రామానికి చెందిన షేక్ చాంద్ బాషా కు భాషికం కట్టే అవకాశం వచ్చిందిని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే సంతానం కోసం ముడుపులు కట్టినవారు మంగళవారం ఉదయం దర్గా వద్ద ప్రసాదం తీసుకెళ్లాలని కోరారు.

## దారి మూసివేత చర్యను వెనక్కి తీసుకోవాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్**



సబ్‌కలెక్టర్‌కు విన్నవిస్తున్న దృశ్యం

**మదనపల్లె, జులై 7 ప్రభాతవార్త :**

మదనపల్లె రూరల్ మండలంలోని కొత్తవారిపల్లె గ్రామ పంచాయితీ పరిధిలో ఆర్‌సి.వడ్డిపల్లె వద్ద అక్రమంగా దారి మూసివేసి స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్నారని, మూసివేసిన దారిని తొలగించి న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నరసింహులు అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఆర్‌సి.వడ్డిపల్లె గ్రామ ప్రజలు గత 40ఏళ్లుగా ఉపయోగిస్తున్న దారిని ఇటీవల స్థానికులు బి.రెడ్డప్ప, అతని కుమారుడు బి.కుమార్‌లు కలసి అక్రమంగా ప్రహరీగోడ కట్టి పూర్తిగా దారిని మూసివేయడం జరిగింది. దీంతో దారికి పైబాగాన ఉన్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇతర అవసరాల నిమిత్తం బయటకు వెళ్ళాలంటే దారి లేక అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దారి సమస్య తీర్చకపోతే ప్రజల సమిష్టితో పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణప్ప, మురళి, మాధవ్, అంజనప్ప, బాధిత గ్రామస్తులు రమేష్, శ్రీనివాసులు, వెంకటరమణ, అంజనప్ప, రెడ్డితరుణ్, జగదీష్, సుబద్ర, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులును ఆకస్మిక తనికి



**ముద్దనూరు. జూలై 07. ప్రభాతవార్త:**

రైల్వే స్టేషన్‌లో నిర్మిస్తున్న ప్లాట్ఫారం పనులను, రైల్వే గేట్ సమీపంలో చేపడుతున్న మరమ్మతుల ను సోమవారం నాడు గుంతకల్ డివిజన్ డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రైల్వే ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా, ఎప్పటికప్పుడు నీటి వసతిని సమకూర్చి, రాత్రి సమయాలలో ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా భద్రత ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ప్లాట్ ఫారం, రైల్వే గేటు సమీపంలో చేపడుతున్న మరమ్మతుల పనులను పూర్తి చేయాలని రైల్వే సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

## మంచి జీవనశైలితో లక్ష్యాలు మీ సొంతం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పీలేరు జూలై 7 ప్రభాతవార్త :**

చదువు పరమైన వత్తిడిని అధిగమించే మేలైన జీవనశైలిని ప్రతి విద్యార్థి అలవర్చుకొంటే మంచి భవిష్యత్తు ప్రతి విద్యార్థి స్వంతమోతుందని డా: తలుపుల పిహెచ్ సి వైద్యాధికారులు డా:శ్రీగిరీష మరియు డా:చంద్రశేఖర్ సంయుక్తంగా విద్యార్థులకు హితవు చెప్పారు. సోమవారం ఎపిబాలికల గురుకుల పాఠశాల పిలేరు బాలికలకు " మంచి జీవనశైలి మనకెంతో మేలు" అంశముపై అధికారులు బాలికలకు అవగాహన కల్పించారు. విద్యార్థి తెలియని ఆందోళన విసుగు వత్తిడికి లోనైతే అది చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని, మీలో సందేహాల మీ టీచర్స్ కి తెలిపి,ఫలితాల్ని అంచనా వేసుకోవాలని, సమయపాలన, ఓర్పు నేర్పు, విద్యార్థి దశనుండే అలవర్చు కోవాలని, ఫలితంగా నిజజీవితంలో చదువుపై మరింత శ్రద పెరిగి ఆశించిన ఫలితాలు మీ స్వంతమోతాయని డా:శ్రీగిరీష డా:చంద్రశేఖర్ బాలికలకు వివరించి, తర్వాత చిరువ్యాధులకు చికిత్స చేసి మందులు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకేశ్వరి, డిప్యూటీ హెచ్ఐఓ కొండయ్య, ఏయన్ యం కృష్ణమ్మ, సిహెచ్ఓ లావణ్య, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన సింగారెడ్డి జయచంద్రారెడ్డి

**వేంపల్లె: జూలై 07 (ప్రభాత వార్త):**

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని సోమవారం రాయచోటి జిల్లా లోని మోటుకట్ల గ్రామంలో కలిసినట్లు వేంపల్లి వృషభాచలేశ్వర దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డి , గిడ్డంగివారి పల్లె గోపాల్ రెడ్డి లు తెలిపారు. అనంతరం ఆయనకు శాలువ కప్పి సన్మానించారు. అనంతరం పలు రాజకీయ విషయాలు ఆయనతో వారు చర్చించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సింగారెడ్డి జయశంకర్‌రెడ్డి ఉన్నారు.

